క్లుప్తంగా

సింగరాయకొండ సర్కిల్లో 144 సెక్షన్ విధింపు

సింగరాయకొండ: చిత్తూరు జిల్లా పుంగనూరులో రెండు రాజకీయ పార్టీల మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో సింగరాయకొండ సర్కిల్ టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల పరిధిలో 144 సెక్షన్ విధించినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థల వారు రోడ్డుపై లేదా పబ్లిక్ ప్రాంతాల్లో నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

జీతాలు చెల్లించాలంటూ వినతి



తహసీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మర్రిపూడి: మండలంలో బదిలీ, పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలంటూ ఏపీటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యుల శనివారం స్థానిక తహసీల్దార్ కృష్ణారావుకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వినతిపత్రం సమర్పించినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. వినతిప్రతం ఇచ్చిన వారిలో బీడీ కిషోర్‌కుమార్, శ్రీనివాసులు, టి.నాగరాజు, ఎంపీ నారాయణ ఉన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ఉలవపాడులో పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ఉలవపాడు: ఉలవపాడులోని పోలేరమ్మ తల్లి పొంగళ్లలో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘట్టం నిలుపు నిర్వహించారు. అనంతరం పావనం, పాలవల్లి కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పోలేరమ్మ పొంగళ్లు, బండ్లు ఊరేగింపుతో పొంగళ్లు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

జూదరుల అరెస్టు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం పైడిపాడు గ్రామ శివారులో పేకాట కేంద్రంపై శనివారం సెబ్ అధికారులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7,640 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులతో పాటు నగదును స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించామని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపనున్నట్లు సెబ్ ఎస్‌ఐ దయాకర్ వివరించారు.

కుష్టు వ్యాధిపై అశ్రద్ధ తగదు

ముండ్లమూరు: గ్రామాల్లో కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాధవీలత కోరారు. మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పూరిమెట్లలో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యాధికారి ప్రవీణ్ పాటు 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీమవరం, పూరిమెట్ల, మారెళ్ల, నూజిళ్లపల్లిలో నూతనంగా కనిపెట్టిన కుష్టు రోగులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ముండ్లమూరు: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ యువీ కృష్ణయ్య తెలిపారు. దర్శి - అద్దంకి ప్రధాన రహదారిలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమం నిర్వహించారు. ఉల్లగల్లు, రెడ్డినగర్ ప్రభుత్వ పాఠశాలల వద్ద గల రహదారిలో స్పీడు బ్రేకర్లకు తెల్లరంగు వేయించిన అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం కావాలి

- హాస్పిటల్‌లో నిపుణులైన వర్కర్‌లను మాత్రమే నియమించాలి
- ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, హాస్పిటల్ సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాలలో జరిగిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రతి రోగికి వైద్యసేవలు సకాలంలో అందించాలని, వైద్యశాలలో అందించే సేవల గురించి రోగులకు తెలియజేయాలన్నారు. అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండి సత్వర సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం హాస్పిటల్‌లో అందిస్తున్న సేవలు, వైద్యులు, ఓపీ వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

పంబ్లర్ నియామకంపై అభ్యంతరం....

వైద్యశాలలో నూతన పంబ్లర్ నియామకంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిబంధనలు పాటించి ప్లంబర్‌ని నియమించారని ప్రశ్నించారు. అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వ్యక్తిని కందుకూరులో ఎలా ప్లంబర్‌గా నియమించారని, నియమించిన వ్యక్తికి సరైన అర్హతలున్నాయా లేదా అని పరిశీలించారా, ఏ అధికారి అనుమతితో నియామకం జరిగిందని ప్రశ్నించారు. హాస్పిటల్ కమిటీకి కనీస సమాచారం లేకుండా ఎలా నియామకం జరిగిందని, నిబంధనలు పాటించకుండా ఎందుకు చేపట్టారని చెప్పారు. ఈ నియామకాన్ని వైద్యశాల కమిటీ తరుపున పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని సమావేశ మినిట్స్‌లో నమోదు చేయాలని, దీనిపై జిల్లా వైద్యాధికారులతో మాట్లాడతానని చెప్పారు.

ప్లే జోన్ ప్రారంభం

ఏరియా వైద్యశాలలో చిన్న పిల్లల వార్డులో ఉండే పిల్లలకు ఆహ్లాదాన్ని అందించేందుకు, ఆటలు ఆడుకునే విధంగా ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ప్లే జోన్‌ను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఇస్కాల జ్యుయలర్స్ యజమాని ఇస్కాల ప్రతాప్ సహకారంతో వాసవీ సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చెక్కా వెంకట కేశవరావు ప్లే జోన్ ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు.

వైద్యశాల వాతావరణాన్ని, అనారోగ్య సమస్యలను మరిచిపోయి చిన్న పిల్లలు ఉత్సాహంగా ఆడుకునేందుకు ఈ ప్లేజోన్ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. వైద్యశాల సూరింటిండెంట్ డాక్టర్ శకుంతల, కమిటీ మెంబర్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అధిలాభాను, డాక్టర్ ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజాభివృద్ధి



పుస్తకాలు అందజేస్తున్న వైస్ఎంపీపీ, హెచ్ఎం

సీఎస్‌పురం (పామూరు): విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల హెచ్ఎం షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి హెచ్‌యంతో కలిసి పంపిణీచేశారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదిగి తద్వారా సమాజ అభివృద్ధికికూడా పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించాలనే లక్ష్యంతో అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య, విద్యాకానుక పథకాలతో ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటునందిస్తోందన్నారు. సర్పంచ్ ప్రవీణ్, మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు కమ్మనేతి వెంకటేశ్వర్లు, నాయకులు బుడేసాహెబ్, గిద్ద మాలకొండయ్య, నాయబ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



భూములను సర్వేచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పామూరు: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. పామూరు నెల్లూరురోడ్డులోని భూములను శనివారం తహసీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ బత్తుల మల్లికార్జున, వీఆర్‌ఓ జక్కా సరస్వతిల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆర్ఐ మల్లికార్జున మాట్లాడుతూ డంపింగ్‌యార్డ్ సర్వే నంబర్ 347/2తో పాటు మరికొన్ని సర్వేనంబర్లలో సర్వే నిర్వహించామన్నారు. డంపింగ్‌యార్డ్ సమీపంలోని భూమి కొంతమేర ఆక్రమణకు గురైనట్లుగా ఉందని మరలా పూర్తిస్థాయిలో సర్వే చేయనున్నట్లు తెలిపారు. దీనిపై ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డికి తెలిపామన్నారు. మండల సర్వేయర్ కె.స్నేహ, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి



ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందచేస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారి



గుడ్లూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఉలవపాడు: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఎంపీడీఓ చెంచమ్మ, వైద్యాధికారి రమ్యజ్యోతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ నెల 10న జాతీయ నులుపురుగుల దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ మింగించాలని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందచేశారు. యంఈఓలు ప్రసాదరావు, రమణయ్య, వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు అల్‌బెండోజోల్ మాత్రలను ఎంపీడీఓ చంద్రసేన్ శనివారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థుల కడుపుల్లో నులి పురుగులు ఉంటే అనేక ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా వారిలో ఎదుగుదల నిలిచిపోతుందన్నారు. వైద్యాధికారి మారుతీరావు, ఎంఈఓ-2 గోవర్ధన్, సీహెచ్‌ఓ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగసముద్రం: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని అన్ని పాఠశాలలకు అల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రమష్ తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలు మింగించాలన్నారు. ఎంపీడీఓ శేషబాబు, డాక్టర్ అనూరాధ, సీహెచ్‌ఓ జి.శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లి పాలలోనే వ్యాధి నిరోధక శక్తి



సాలిపేటలో సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రమణయ్య



కొండసముద్రంలో కిట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్, హెచ్ఎం

కనిగిరి రూరల్: తల్లి పాలలోనే వ్యాధినిరోధక శక్తి, మంచి పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని బల్లిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి వివరించారు. ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్, ఎంపీటీసీ ఎం గురవయ్య, ఎంఎస్‌కే ఆదిలక్ష్మి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షులు, దాసరిపల్లి సర్పంచ్ భవనం క్రిష్ణారెడ్డి అన్నారు. దాసరిపల్లి సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలింతలు, గర్భవతులకు శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. వైఎస్సార సంపూర్ణ పోషకాహార కిట్లను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కుందురు నారాయణరెడ్డి, మండల కార్యాలయ సీనియర్ సహాయకులు మధుసూదన్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ శెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన అరగంటలో తల్లిపాలు పట్టించాలి

మర్రిపూడి: బిడ్డ పుట్టిన అరగంటలోగా తల్లి ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సుచరిత మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేయించుకోవాలన్నారు. తల్లి పాలల్లో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందని, ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్త కెజియా, ఆయాలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

గుడ్లూరు: మండలంలోని సాలిపేటలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, తల్లులకు సర్పంచ్ చేపల రమణయ్య వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: తల్లి పాలు బిడ్డకు శ్రేష్టమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని కూనిపాలెం, కొండసముద్రం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రధానోపాధ్యాయుడు ఎం గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు ఉషారాణి, నాగేంద్ర శిరోమణి, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



బల్లిపల్లిలో కిట్లను అందచేస్తున్న సూపర్‌వైజర్ పార్వతి



గర్భిణులకు కిట్లు అందజేస్తున్న భవనం కృష్ణారెడ్డి



మర్రిపూడిలో తల్లులకు అవగాహన చేస్తున్న సూపర్‌వైజర్ సుచరిత

బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేయాలి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉష

సింగరాయకొండ: మండలంలోని బీఎల్‌ఓలు ఓటరు సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే తప్పనిసరిగా చేయాలని, ఈ సర్వేలో ఎటువంటి అవకతవకలు జరిగినా బీఎల్‌ఓలే అందుకు బాధ్యత వహించాలని తహసీల్దార్ సీహెచ్ ఉష హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఓటరు సర్వేపై బీఎల్‌ఓలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఉష మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా సింగరాయకొండ మండలంలో 52,806 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 50 శాతం మాత్రమే ఓటరు సర్వే జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వేను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి ఫ్యామిలీ సభ్యులు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 80 ఏళ్ల వయసు పైబడిన వారు, వికలాంగుల జాబితాను తప్పనిసరిగా సిద్ధం చేయాలని సూచించారు. సంచారజాతులు, యాచకుల ఓట్లు కూడా నమోదు చేయాలన్నారు. ఎన్ఆర్ఐల జాబితాను కూడా సిద్ధం చేయాలన్నారు. బీఎల్‌ఓలు తమ పరిధిలో డూప్లికేట్ ఓట్లు, డెత్‌లు, సున్నా డోర్ నెంబరు ఉన్న ఓటర్ల జాబితాను కూడా తయారు చేయాలని వివరించారు. ప్రతి బీఎల్‌ఓ తమ పరిధిలో 4 శాతం మాత్రమే కొత్త ఓట్లు నమోదు కాని, తొలగింపులు కాని చేయాల్సి ఉంటుందన్నారు. అంతకన్నా ఎక్కువ ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, ఓటరు సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరిగినా దానికి బీఎల్‌ఓనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఓటరు చనిపోతే మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు కుటుంబ సభ్యుల డిక్లరేషన్ కూడా తప్పనిసరిగా నమోదు చేయాలని వివరించారు. బీఎల్‌ఓ వెంట ఒక రాజకీయ పార్టీకి చెందిన ఒక బీఎల్‌ఏ ఉండాల్సి ఉండగా చాలాచోట్ల ఒక పార్టీకి చెందిన ఎక్కువ మంది బీఎల్‌ఏలు తిరుగుతున్నారని వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు.. తహసీల్దార్ ఉష దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ ఒక బీఎల్‌ఓ వెంట ఒక పార్టీకి చెందిన బీఎల్‌ఏ మాత్రమే ఉండాలని ఆమె వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఓ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ తిరుమలరావు, జూనియర్ అసిస్టెంట్ శివ, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులు బయోమెట్రిక్ చేయించుకోవాలి

కందుకూరు: నేషనల్ మైనార్టీ స్కాలర్స్‌కు కోసం గతేడాది దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత విద్యా సంస్థ ఐడీతో బయోమెట్రిక్ చేయించుకోవాలని మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాష శనివారం సూచించారు. ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ముందుగా సంబంధిత విద్యా సంస్థ నోడల్ ఆఫీసర్ చేత వారి ఇన్‌స్టిట్యూట్ యూజర్ ఐడీతో వేయించాలన్నారు. తరువాత విద్యార్థి చదువుతున్న పాఠశాల లేదా కాలేజీలో దరఖాస్తు చేసుకున్న స్కాలర్‌షిప్ దరఖాస్తు ఐడీ నంబర్‌తో బయోమెట్రిక్ నమోదు చేసి ఆన్‌లైన్ అప్లికేషన్‌లో పంపించాలన్నారు.

అప్పుడు మాత్రమే దరఖాస్తును అనుమతిస్తారని లేదంటే దరఖాస్తును తిరస్కరిస్తారని చెప్పారు. కావున 2022-23 విద్యా సంవత్సరంలో మైనార్టీ స్కాలర్‌షిప్స్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పనిసరిగా సంబంధిత నోడల్ ఆఫీసర్ బయోమెట్రిక్, విద్యార్థి బయోమెట్రిక్ కచ్చితంగా వేయించి స్కాలర్‌షిప్ పొందాలని సూచించారు.

విద్యార్థులకు పేట్లు, గ్లాసులు అందజేత



పేట్లు, గ్లాసులు పంపిణీచేస్తున్న ఎస్‌ఓ శైలజ, దాత వేణు

పామూరు: విద్యార్థినులు దాతలు సమకూర్చి అందజేసిన పేట్లు, గ్లాసులు, యూనిఫాం సద్వినియోగం చేసుకోవాలని కేజీబీవి ఇన్‌చార్జ్ ఎస్‌ఓ ఎం శైలజ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆర్యవైశ్యసంఘం నాయకుడు, వ్యాపారి సోమిశెట్టి వేణు గోపాల్ తన సొంతనిధులతో ప్లేట్లు, గ్లాసులు, యూనిఫాంక్లాత్ సమకూర్చి పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వ, దాతల సాయాన్ని వినియోగించుకుని క్రమశిక్షణతో విద్యనభ్యసించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.

వృద్ధులకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సింగంపల్లి లక్ష్మీసరయు

కనిగిరి రూరల్: పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ కుమార్తె సింగంపల్లి నాగ హరి లక్ష్మి సరయు పుట్టిన రోజు సందర్భంగా శనివారం స్థానిక ఎస్‌కేఆర్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో ఆల్పాహారం విందు, వృద్ధుల ఆశ్రమంలో దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. తొలుత సింగంపల్లి నాగహరి లక్ష్మీ సరయు వృద్ధుల మధ్య, దివ్యాంగ చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. బ్రహ్మణ సంఘ నాయకులు పరకు సత్యగోపాల్, ధూళిపాళ్ల వీర భద్రరావు, ధూళి పాళ్ల మల్లికార్జునరావు, చంద్రశేఖరరావు, సంగరాజు సాయి మనోజ్, చక్కిలం మురళీకృష్ణా, ఉమాకాంత్, తిమ్మరాజు వంశీ, చలపతిరావు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



రికార్డులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీ సచివాలయాన్ని శనివారం చైర్మన్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ రికార్డులను, హాజరు రిజిష్టర్లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సచివాలయ అధికారులు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలన్నారు. అర్జీదారుల సమస్యలను పూర్తిగా తెలుసుకుని సాధ్యమైనంతవరకు తక్షణ పరిష్కారం చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్లలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం జరుగుతుందని ఎంపీడీఓ చెంచమ్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని ఆమె కోరారు.

8 నుంచి వెలిగండ్లలో...

వెలిగండ్ల: మండలంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 8, 9వ తేదీల్లో పి.రాళ్లపల్లి సచివాలయం పరిధిలో, 10,11 తేదీల్లో ఇమ్మడిచెరువు సచివాలయం పరిధిలో, 12,13 వ తేదీల్లో రామగోపాలపురం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొంటారన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

కొనకనమిట్ల: నమో వేంకటేశాయా నమోనమః అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు జరిపించారు.